


పడమటకు ఎదురుగా ఓ విశాలమైన వెల్తురూ రావాలన్న ఉద్దేశ్యంతో కిటికీ కిటికీ - కిటికీలోనుండి బాగా గాలీ, పెద్దగా పెట్టించాడు ఇల్లుగలాయన.

ఆ కిటికీకి ఆరు కమ్మీ లున్నాయి. ఓ కమ్మీకీ, మరో కమ్మీకీ మధ్యనున్న ఖాళీలో చిన్నతల ఉన్న ఒకపసిబిడ్డ సులభంగా అటునుం డిటు తిరగవచ్చు.

ఆ రెండు కమ్మీలకు మధ్య తలపెట్టి కూర్చున్నారు శాలమ్మ — శిలాప్రతిమలా, జీవచ్ఛవంలా, మైకంలో పడ్డవారిలా, పిడుగుపడినట్టుగా.

పదమూడవ ఏట భర్తను పోగొట్టుకున్న బాలవిధవ శాలమ్మ, తమ్ముడింట్లో కాలక్షేపం చేస్తున్నారు.

ఆమె అరవయ్యేళ్ళ జీవితమూ ఇరుగు పొరుగువాళ్ళని ఆడిపోసుకోవటంలోనే గడిచిపోయింది. మిగతా నలభై ఏళ్ళనుకూడా అలాగే గడిపేయాలని నిశ్చయించుకున్నా రామె.

తమ్ముడూ, అతని పెళ్ళాం పిల్లలతో కలసి హాయిగా తిని, చింతగా కాలక్షేపం చేసే దావిడ.

కానీ తమ్ముడు — అతని పెళ్ళాం మాటేవిటి? వాళ్ళ సుఖంమాట దేవు డెరుగు!

ఉదయం సుమారు ఎనిమిదిగంటల ప్రాంతంలో శాలమ్మ కిటికీకి తల అన్చి చూపుని పక్కింటి కిటికీగుండా లోతలికి పోనిచ్చి, అక్కడి గదిలోనుండి, హాల్లో జరుగుతున్నదాన్ని డిటెక్టివ్ లాగా, విమర్శకురాలిలాగా పరీక్షగా చూస్తూ కూర్చున్నారు.

"వదినా, కుంపటిమీద పాలగిన్నె పెట్టాను, కాస్త చూడండి. నేను స్నానానికి వెడుతున్నాను;" తమ్ముడి భార్య అంది.

శాలమ్మ అక్కడినుండి కదల్లేదు. "ఊఁ" అన్నారు, కూర్చున్నచోటినుండే ఆమె కేం వేరే పనీ పాటాలేదూ — వెళ్ళి పాలు కాస్తూ కూర్చోవటానికి?

శాలమ్మ మేనగోడలు, చిన్నపిల్ల నళిని వచ్చి, "అత్తయా! బడికి టైమవుతూంది. జడ వెయ్యవూ?" అంది.

అత్తయ్య బదులు చెపితేగా!

"అత్తయ్యా?......"

"ష్...ష్..." అంటూ శాలమ్మ ఇటు తిరక్కుండానే నళినిని దూరంగా జరిపారు.

"అత్తయ్యా!"

అత్త జవాబు చెప్పలేదు. ఇప్పుడు ఆమె తన కళ్ళనేకాక చెవులను కూడా చురుగ్గా అటుతిప్పి వాళ్ళమాట లేమయినా వినిపిస్తాయేమో అని చూస్తున్నారు. పెదవుల కదలికవల్ల వాళ్ళేమి మాట లాడుతున్నారో ఊహించడానికి ప్రయత్నిస్తున్నారు.

"అత్తయ్యా!"

"ష్...అరవకు...వెళ్ళవతలికి."

'అమ్మ స్నానానికి వెళ్ళింది. అత్తయ్యేమో అస్తమానం కిటికీముందు కుర్చీ వేసు క్కూర్చుని, ఇహ కదలదు. అదేంపనో అర్థంకాదు. చేతిలో ఓ పుస్తకంమాత్రం ఉంటుందిగాని చదివింది

లేదెప్పుడూ' అనుకుంటూ నళిని చింపిరి జుత్తుతో అలాగే బడికి వెళ్ళిపోయింది. కుంపటిమీద పాలు పొంగిపోయాయి. పాలు పొంగిన వాసన ఇల్లంతా అలుము కుంది.

నీళ్ళగదిలోనుండి తమ్ముడిభార్య కేక పెట్టింది.

"వదినా! పాలు పొంగినట్టున్నాయి."

పక్కింటివారు ఏం మాట్లాడు తున్నారో ఊహించటంలో నిమగ్న మయిన శాలమ్మకు మరదలిపిలుపు వినిపించలేదు.

"వదినా!"

శాలమ్మ కస్సు, బుస్సుమంటూ పైకి లేచారు.

"ఛీ, పాడుకొంప! ఓక్షణం శాంతిగా కూర్చోనివ్వరు కదా! దాసీదానికన్నా హీనమయిపోయాను నేను. వా డంతకు సరేసరి,

నోటి కొచ్చిందల్లా వాగుతూ వంట గదిలోకి వెళ్ళిం దావిడ.

కుంపటిమీద పాలగిన్నె ఉంది. ముప్పాతికభాగం పాలంతా అగ్నిదేవు నికి ఆహుతి అయింది. అడుగున కొద్దిగా ఉన్న పాలు మరుగుతున్నాయి.

గిన్నె దించి నేలమీద పడేసి, గబ గబా తమ స్థానంలో తిష్టవేశారు శాలమ్మ.

తమ్ముడి భార్య సీతమ్మ స్నానం చేసి వచ్చి చూసేసరికి పాలగిన్నె ఇంచు మించు ఖాళీ అయింది. ఇల్లంతా కాలిన పాల వాసన అలముకుంది. కోపం రాక పోవడానికి ఆవిడ త్రేతాయుగపు సీత కాదు కదా!

"వదినా!"

వదిన ఇక్కడుంటేగా? ఆవిడ దేహం మాత్రమే అక్కడుంది. కళ్ళూ, మనసూ, చెవులూ అంతా పక్కింట్లోనే ఉన్నాయి.

"పాలు పొయ్యిమీద పెట్టానని చెప్ప లేదూ..."

"సీతా, కాస్త మాట్లాడించకు."

"పాల సంగతి అడుగుతుంటే..."

"అదిగో...పక్కింట్లో..."

సీతమ్మ కోపం అవధులు దాటింది. "పక్కింటి సంగతి నా కనవసరం; మనింటి సంగతి చెప్పండి ముందు."

శాలమ్మ దెబ్బలాటకు సిద్ధంగాలేదు ఆమె నిర్వికారంగా కిటికీనుండి బయటికి చూడసాగారు.

సీతమ్మ విసుగ్గా లోపలికి వెళ్ళి పోయింది.

సుమారు పదకొండింటికి శాలమ్మ కిటికీముందునుండి లేచారు. మడి గట్టు కుని, భోంచేసి పదినిమిషాలు విశ్రాంతి తీసుకుని తన స్నేహితురాలు నరసమ్మ కోసం బయల్దేరారు. ఆవిడా శాలమ్మ కోసం వస్తోంది.

ఇద్దరిదీ ఒకే వయసు. ఒకేస్థితి. ఒకే బుద్ధి. ఒకే మనసు.

"మీ ఇంటికే బయలుదేరాను,"

అన్నారు నరసమ్మ.

"నేనూ మీ యింటికే బయల్దేరాను," అన్నారు శాలమ్మ.

"అయితే ఇప్పు డేం చేద్దాం ?"

"మా యింటికే వెడదాం పదండి. మీ కో సంగతి చెప్పాలి "

"నేనూ మీకు చెప్పాల్సింది చాలా వుంది; పదండి."

ఇద్దరూ శాలమ్మ ఇంటివైపు అడుగులు వేయసాగారు. ఇంటికి వెళ్ళే లోపలే నరసమ్మకు ఆత్రం. దారిలోనే ఆవిడ తను తెలుసుకున్న సంగతి చెప్ప సాగారు.

"కాశీపతయ్యగారి అల్లుడికి క్షయట, శాలమ్మా; దాచుకుంటున్నారు."

"ఆస్పత్రిలో చేర్పిస్తే పోలా ?"

"ఆస్పత్రివాళ్ళేం వూరికే చేర్చుకుంటారా ? ఎంత డబ్బు కావాలీ, ఏం కథా ?"

"అదీ నిజమే : మరేమో ఆ నీలకంఠరావు లేడూ, వాళ్ళబ్బాయి ఓ, చవట—"శాలమ్మ ఉవాచ,

"అలాగా..."

"ఊఁ...అందుకే పెళ్ళయి రెండేళ్ళయినా పెళ్ళాన్ని తీసుకురాలేదు."

"బి. ఏ. చదవనీ – అని పుట్టింట్లో వుంచా డన్నారే ఎవరో."

"అదో నెపం. అంతే."

"ఆ అమ్మాయికి కడుపుట..."

"ఎవరో... ఏమిటో..."




శాలమ్మ నాలుకముందు ఎవరూ నో రెత్తక్కర్లేదు. అన్నీ చూసినవారి లాగే మాట్లాడేవారు. ఆమె మాటల్లోని సత్యాసత్యాలను పరీక్షించాలనుకునేవారిదే తెలివితక్కువ.

"ఆచార్లవారి అబ్బాయి ఎవతో సినిమాదాన్ని కట్టుకున్నాడట."

నరసమ్మ – శాలమ్మలు ఇద్దరూ ఓ ఒప్పందం చేసుకున్నారు. నరసమ్మ ఓ

కొత్తసంగతి చెపితే. శాలమ్మ మరొకటి చెప్పాల్సిందే !— ఆఖరికి కల్పించికుని చెప్పినా సరే.

"నిజంగానే!" — శాలమ్మ అడిగారు.

"కాకపోతే అబద్ధం చెపుతున్నానా మరి ? అయినా మరొకరి సంగతి మన కెందుకులెండి. మనం వాళ్ళింట్లో భోంచె య్యాలా పెట్టాలా?" నరసమ్మ అన్నారు.

"కాలం చెడిపోయిందమ్మా. సినిమా దాని సంగ తలా ఉంచండి. దేవోజీరావు గారి అబ్బాయి అమెరికా వెళ్ళి అక్కడి పిల్లనే పెళ్ళి చేసుకున్నాడట. ఇకిక్కడికి రాడట. దేవోజీరావుగారి మడి ఆచారులు చూస్తే ఆకాశాన్ని అందుకుంటాయి."

"అలాగా."

"ఆc. ఓరోజు దేవోజీరావుగారిభార్య మంచినీళ్ళు అడిగారు. నేను పైకి లేచాను. ఆవిడ "వద్దండీ, నేనే తీసు కుంటాను," అన్నారు. నేను సకేశినని వారికి నా పొడ గిట్టదు."

"ఆపొగరుమోత్తనాకి తగినశాస్తి జరిగింది లెండి లేకపోతే దేవుడు లేడూ ? ధర్మం, కర్మం అంటూ ఉండదూ ?"

నరసమ్మా, శాలమ్మా మళ్లీ ధోరణిలో కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు. విష యాలు మారినా, తోవ మారినా వారు మాత్రం మారలేదు. ఎండలో మొహాలు ఎర్రగా చేసుకుని ఇంటికి వచ్చారు.

సీతమ్మ కాఫీ, టిఫిన్ తయారుచేసి పెట్టింది. ఇద్దరూ టిఫిన్ తిని, కాఫీ తాగి ఓ రెండుక్షణాలు విశ్రాంతి తీసుకుని మళ్ళీ పెత్తనానికి బయలుదేరారు.

"రాత్రి ఎనిమిదింటికి వస్తానమ్మా సీతా–రామమందిరంలో హరికథ ఉందట విని వస్తాను —'' అన్నారు శాలమ్మ మెట్లు దిగుతూ.

"సావకాశంగా రండి, తొందరేం లేదు," అంది సీతమ్మ తలుపు వేసు కుంటూ–'కావాలంటే అక్కడే చావండి' అనుకుంది మనసులో.

శాలమ్మా — నరసమ్మా చుట్టుపక్కల ఇళ్ళల్లో పెత్తనాలు చెయ్యసాగారు. వీ రిద్దరూ ఇంటిముందు కొచ్చి నించుంటే ఇంట్లోవారు వాళ్ళ మొహంమీదే దభీ మని తలుపు వెయ్యలేరుకదా ? కానీ వెంకమ్మ కోడలు మహాగయ్యాళి. ఓసారి శాలమ్మ, "వెంకమ్మగారున్నారా?" అని గుమ్మంముందు నుంచుని అడిగినపుడు, "నాకు తెలియదు" అని ఆవిడ మొహం మీదే తలుపు వేసుకుంది.

అరుగు రున్న ఇంట్లో అరు పక్షా లయ్యాయి — శాలమ్మ దయవల్ల. అప్పటి నుండీ శాలమ్మంటే వళ్ళు మండేది వెంకమ్మగారి కోడలికి.

"మా ఇంట్లో అడుగుపెడితే, కాళ్ళు విరగ్గొడతాను,'' అంది, శాలమ్మ అరవ య్యేళ్ళ ముసలిదన్నసంగతికూడా మరచి పోయి.

"మీ తాత లేచిరావాలి!'' శాలమ్మ ఈసడించింది.

"అయితే చూద్దురుగాని," అంటూ ఆ గయ్యాళికోడలు రోకలి పట్టుకొచ్చింది.

ఇక శాలమ్మకు మిగిలింది ఒక్కటే దారి — పలాయన సూత్రం.

ఆ ఇంటినుంచి చాలా దూరం వచ్చాక శాలమ్మ తిరిగిచూసి 'ఉస్సో'సి, "అందుకే పెళ్ళయి ఆరేళ్ళయినా పిల్లా పాపాలేరు," అని మెటికలు విరిచింది.

శాలమ్మ—నరసమ్మ రామమందిరానికి వెళ్ళి కూర్చున్నారు. ఆవాళ సీతాప హరణం హరికథ.

"శాలమ్మా! ఈ దాసుగా రున్నారే— తుమకూరులో ఎవతోఅమ్మాయిని లేపు కొచ్చారని కేసయింది." నరసమ్మ ఉవాచ.

"వీడి మొహానికి హరికథ కూడాను."

"ఆ అమ్మాయికి పిల్లకూడా పుట్టిం దట — పెళ్ళికూడా కాలేదుట."

"ఇలాటివారి నంతా తీసికెళ్ళి ఉరి తియ్యాలి శాలమ్మా," అన్నారు.

దాసుగారు హరికథ మొదలెట్టారు.

ఇక్కడ శాలమ్మ, నరసమ్మలు మరో హరికథ మొదలెట్టారు. రాత్రి తొమ్మి దింటికి హరికథ పూర్తయింది. శాలమ్మ, నరసమ్మలు లేచి బయలుదేరారు.

త్రోవలో శాలమ్మ మరోకథ మొద లెట్టారు.

"మా పక్కింట్లో నెల రోజులుగా ఓ తమాషా జరుగుతోంది."

"ఏమి టది ?"

"మా పక్కింటావిడ ఓ డాక్టరు. ఆవిడ మొగుడో మాష్టారు. ఆవిడ ఉదయం ఎనిమిది గంటలకల్లా ఆస్పత్రికి వెళ్ళిపోతుంది. తరువాత పావుగంటలోపలే అత నో అమ్మాయిని పిలిపించుకుంటాడు. ఇక చూడండి వాళ్ళిద్దరి సరసాలూ, నవ్వులూ. చూసే వాళ్ళది పాప మనుకోండి."

"ఏన్నేళ్ళుంటా యా పిల్లకు ?"

"పదహారు, పదిహేడే ళ్ళుంటాయి. గాడిదలాగా పెరిగింది. అందంగా సింగారం చేసుకుని వస్తుంది. నెపానికి చేతిలో నాలుగు పుస్తకా లుంటాయి. స్కూలుకు వెడతానని ఇంట్లో చెప్పి ఇక్కడికి వస్తోందో ఏం పాడో."

"తరువాత ?"

"పధిన్నర దాకా అలా సరసాలాడి వెళ్ళిపోతుంది. ఆ తరువాత తాళం వేసుకుని అతనూ స్కూలికి వెడతాడు."

"ఆ డాక్టరమ్మకు తెలియదా ఇదంతా?" నరసమ్మ సానుభూతితో అడిగింది.

"ఎలా తెలుస్తుంది? ఆవిడ ఆస్పత్రికి వెళ్ళాకే వస్తుం దీ పిల్ల. మళ్ళీ వచ్చే సరికి వుండదు."

"అదీ నిజమే."

"రత్నంలాటి భార్య ఉండగా ఆ పసి పిల్లతో సరసా లాడటాని కేం ఖర్మ."

"మగవారి బుద్ధి ఇలాటిది అని ఎలా చెప్పగలం"—అన్నారు నరసమ్మ పురుష

జాతినంతా అర్థం చేసుకున్నవారిలా.

అకస్మాత్తుగా శాలమ్మ కో ఆలోచన స్ఫురించింది.

"నరసమ్మా!"

"ఏమిటి?"

"రే వో పని చెద్దాం."

"ఏమిటి..."

"రేపు ఏడుగంటలకల్లా మీ రిక్కడికి వచ్చేయండి. ఆ పిల్ల రాగానే మనం వెళ్ళి తలుపుకు తాళం వేసేద్దాం."

"అమ్మ బాబోయ్. అంత పనే!"

"భయ మెందుకు? తప్పు చేస్తున్న వారికే భయం లేనప్పుడు మన కేం?"

"ఆ మేష్టా రెలాంటివాడో, ఆ పిల్ల ఎవరో!" నరసమ్మకు భయంగానే ఉంది.

"ఆ మేష్టారి ఉద్యోగం ఊడదీయించక పోతే నా పేరు శాలమ్మే కాదు. కుర్రాళ్ళకు బళ్ళో ఇవే నేర్పుతాడా? భయపడ్డానికి మన మేమీ దొంగతనం చెయ్యటంలేదుగా?"

"నిజమే అనుకోండి."

"పాపం ఆ డాక్టరమ్మను చూస్తే నాకు జాలేస్తుంది."

"అవును."

"వా ళ్ళిద్దర్నీ ఇంట్లో తాళం వేసి, డాక్టరమ్మ వచ్చాక, ఆవిడ ఎదురుగానే తలుపు తీద్దాం."

ఆ దృశ్యాన్ని తల్చుకుని నరసమ్మ పులకితురా లయింది.

"శాలమ్మా! నిజంగా మీది కుశాగ్ర బుద్ధి సుమండీ, కానీ..."

"ఏమిటి?"

"ఆ ఇంటికి రెండుతలుపు లున్నాయి మా?"

"అవును, రెండింటికీ రెండు తాళాలు వేసేద్దాం."

"ఆఁ, ఇక డాక్టరమ్మ బ్రతికిన న్నాళ్ళూ మీ ఉపకారం మరవదు."

"మనిషి అని పుట్టాక ఒకరి కొకరు సాయపడకపోతే ఎలా?"—పరోపకారం కోసమే జన్మించినవారిలా పలికారు శాలమ్మ.

* * *

మరుసటిరోజు యథాస్థానంలో తిష్ట వేసారు శాలమ్మ. నరసమ్మగారిని ఏడింటి కల్లా రమ్మన్నారు. ఏడుగంటలు కొడు తుండగా నరసమ్మ లోపలికి అడుగు పెట్టారు. అంత కరెక్టుగా అన్నటైముకు మరెవరు రాగలరు?

శాలమ్మ నవ్వుతూ "గడియారం చేతిలో ఉన్నవారికన్నా ఖచ్చితంగా వచ్చేసారే!" అన్నారు.

"రాత్రంతా నిద్రపట్టలేదు నాకు," అంటూ శాలమ్మప్రక్కనే మరో కుర్చీ వేసుకుని కూర్చున్నారు నరసమ్మ.

"మీ తమ్ముడు లేడా?"

"ఉహుఁ, ఫ్యాక్టరీకి వెళ్ళాడు."

"సీతమ్మ?"

"సరే, ఆవిడ సంగ తెందు కడుగు



తారు ? తనేమో, తన పనేమో అంతే ! లేకపోతే చేతిలో ఓ పుస్తకం పట్టుకు కూర్చుంటుంది. ఏనుగ ఎగిరినా, గుర్రం గంతులేసినా ఇటు తిరిగిచూడదు.''

"ఇలాంటివారు అడవిలో ఉండాల్సిన మనుషులు—" అన్నారు నరసమ్మ.

అంతలో సీతమ్మ లోపలినుండి బయటికి వచ్చింది.

నల్లటి మబ్బు సుడిగాలుల్లా పక్కపక్కన కూర్చున్న శాలమ్మ, నరసమ్మల వేపు విసుగ్గా చూసింది.

"పనయిందా సీతమ్మా ?"

'అప్పుడే ఎక్కడ ? ఇప్పుడే ప్రారంభం !"

"నువ్వెంత సేపులే, చిటికలో చేసేస్తావ్."

'నువ్వెంత పొగిడినా సరే, నీకు కాఫీ ఇస్తే ఒట్టు,' అనుకుని సీతమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

కాఫీ వస్తుందేమో నని నరసమ్మ మాటిమాటికీ వంటింటివేపు చూడసాగారు. కానీ కాఫీ వచ్చే సూచన లేం కనిపించలేదు.

"చూడండి" — అంటూ శాలమ్మ నరసమ్మను మోచేత్తో పొడిచారు.

నరసమ్మ కిటికీనుండి బయటికి చూశారు.

శాలమ్మ కూర్చున్న కిటికీ ఎదురుగా పక్కింటి కిటికీ ఉంది. అది గదికిటికీ. కిటికీ ఎదురుగా హాల్లోకి తలుపు ఉంది. తెరిచిన ఆ తలుపులోంచి హాల్లో జరిగేదంతా స్పష్టంగా కనిపిస్తోంది. హాల్లో మధ్యన ఓ టేబిల్ ఉంది. డాక్టరమ్మ అప్పుడే బయటికి వెళ్ళే సన్నాహంలో ఉన్నారు.

ఆమె తెల్లచీర కట్టుకుని లేత ఎరుపు రంగు జాకెట్టు తొడుక్కుంది. అందంగా చుట్టిన ముడిలో తెల్ల గులాబి నవ్వుతోంది.

ఆమెకు సుమారు పాతికే ళ్ళుంటాయి. చూడటానికి లక్షణంగా ఉంది. మొహంలో విద్యా, సంస్కారాల కళ ఉంది.

ఆమె టేబిల్‌మీద కాఫీగ్లాసు పెట్టి భర్తను పిలిచిందేమో, కాంపౌండ్‌లోంచి ఇంట్లో కొచ్చాడతను. అతనిచేతిలో మరో తెల్ల గులాబి ఉంది.

మేష్టారు గులాబి ఆమె తల్లో పెట్ట బోయారు.

"ఆహా, ఏం నటన – చూశారూ? పెళ్ళాంముందు నాటక మాడుతున్నాడు;" శాలమ్మ వ్యాఖ్యానించారు.

డాక్టరమ్మ నవ్వుతూ వెనక్కి జరిగింది. చేత్తో వద్దని సైగ చేసింది.

ఇద్దరూ కాఫీ తాగారు. ఆమె బయటికి వెళ్ళి మళ్ళీ ఏదో గుర్తుకు తెచ్చుకున్నట్టుగా లోపలికి వచ్చి భర్తతో ఏదో చెప్పి వెళ్ళింది.

ఆమె వెళ్ళాక మేష్టారు తలుపు వేసుకుని వెనక్కి వెళ్ళారు. పావుగంట తరువాత టవల్‌తో మొహం తుడుచుకుంటూ హాల్లోకి వచ్చారు. అక్కడ రెండు నిమిషా లాగి గదిలోకి వచ్చారు.

ఆయన మెల్లిగా ఈల వేస్తున్నారు.

"ఖుషీ! ఆ రమ వస్తుందని మురిసిపోతున్నాడు;" శాలమ్మ వ్యాఖ్యానం.

ఈల వేస్తూనే పక్కకి వెళ్ళాడాయన. మళ్ళీ కనిపించేసరికి క్రాపు శుభ్రంగా దువ్వబడి ఉంది. తెల్లటి ధోవతి, షర్టులతో ముస్తాబయ్యాడు.

"దానికోసం ఈ అలంకారమంతా," అన్నారు శాలమ్మ మెల్లిగా.

గడియారం ఎనిమిది కొట్టింది. శాలమ్మ నరసమ్మలు ఆత్రంగా ఆ పిల్ల ఆగమనంకోసం ఎదురు చూస్తున్నారు.

ఆఖరికి కాంపౌండ్ గేటు కిర్రుమని చప్పుడు చేసింది. అప్పటికి నాలుగు సార్లు తలుపు తెరచి చూసిన మేష్టారు గబుక్కున లేచివచ్చి తలుపు తీశారు.

ఆ అమ్మాయి లోపలి కొచ్చింది. హాల్లో నిలబడిన ఆ పిల్లను శాలమ్మ, నరసమ్మలు చురచురా చూశారు.

"ఇంకా చిన్న పిల్లే. పదిహేడేళ్ళుంటాయేమో అంతే;" నరసమ్మ గుసగుసలు పోతున్నట్టుగా అన్నారు.

"వయసులో చిన్నదే కానీ అనుభవంలో..." శాలమ్మ అర్థగర్భితంగా నవ్వారు.

ఆ అమ్మాయి నిజంగా అందంగా ఉంది. రెండు జడలు, పువ్వు లున్న వాయిల్‌చీర, ఒక చేతికి గాజు గాజులు, మరోచేతికి వాచీ, కాళ్ళకి హవాయి చెప్పులూ. మేష్టా రేదో అన్నారు. ఆ అమ్మాయి నవ్వింది.

ఎడంచేతిలోని వాచీ తీసి టేబుల్‌మీద ఉంచింది. కొంగు లాగి నడుంచుట్టూ బిగించింది.

డాక్టరమ్మ నిరాకరించిన గులాబీని మేస్టారు ఆ పిల్లకి ఇచ్చారు. ఆపిల్ల దానిని ఓజడలో పెట్టుకుని, పరోజడ చూపించింది. మేస్టారు నవ్వి ఆ జడ లాగి, వీపుమీద మెల్లగా ఓదెబ్బ వేసారు.

తరువాత ఇద్దరూ అక్కడినుండి వెళ్ళిపోయారు. అరగంటయ్యాక మళ్ళీ కనిపించారు. కుర్చీలో కూర్చున్న మేస్టారు వీళ్ళకి కనిపిస్తున్నారు ఆ పిల్ల కనిపించటంలేదు. కానీ మేస్టారు మాట్లాడటం నవ్వటం తెలుస్తునేఉంది.

"ఛా! ఎంత సిగ్గుచేటు!" నరసమ్మ అన్నారు.

"నెలరోజాలుగా చూస్తున్నా, ఇదే వరస. ఇవ్వాళేమయినాసరే డాక్టరమ్మతో చెప్పి వీరికి బుద్ధి చెప్పాల్సిందే"


కానీ నరసమ్మను భయం వదల్లేదు

"వద్దు శాలమ్మా. వాళ్ళెక్కడయినా నాశన మవనీ, మన కేం."

"ఇంత అన్యాయాన్ని చూస్తూ సహించటం నా చేతకాదు;" శాలమ్మ కసిగా అన్నారు.

"సరే, డాక్టరమ్మ ఎన్నింటికి వస్తారు?"

"ఒంటిగంటకు వస్తుందావిడ. ఈవిడ పదకొండింటికి వెళ్ళిపోతుంది. ఒక్కోరోజు మేస్టారూ దాంతోనే వెడతారు," అంటూ శాలమ్మ ముందుగానే సిద్ధంగా వుంచుకున్న తాళాలను చేతికి తీసుకున్నారు.



"వద్దు శాలమ్మా."

"మీ రొచ్చినా సరే రాకపోయినా సరే. నేను వెడుతున్నా."

విధిలేక, వెనకనే నరసమ్మ నడిచారు. ఇద్దరూ చప్పుడు చేయకుండా పక్కింటి కాంపౌండ్‌ను సమీపించారు. ఎవరన్నా అడిగితే 'డాక్టరమ్మ ఉన్నారా?' అని అడిగి వచ్చేయటమే నని తీర్మానించుకున్నారు. శాలమ్మ మెల్లగా గేటు తెరిచారు. నరసమ్మ చేతి కో తాళంకప్ప ఇచ్చి వెనకభాగానికి పంపించారు.

ఇద్దరిపనీ పూర్తయింది. విజయ గర్వంతో బయటికొచ్చి డాక్టరమ్మకోసం ఎదురు చూడసాగారు. ఆవిడ రావటం ఆలస్య మయింది. కాని వీళ్ళమాటల కేం కొదవ?

ఆఖరికి డాక్టరమ్మ దూరంగా కని పించారు. ఆమె అలసిపోయిన మొహం, నీరసించిన నడకా, ఆయాసంతో నీరస పడిన మనసూ ఇల్లు కనపడగానే పరి వర్తన చెందాయి. చురుగ్గా అడుగులు వేయసాగారు.

తలవంచుకు నడుస్తున్న డాక్టరమ్మ త్రోవకు అడ్డుగా నిలిచారు శాలమ్మ.

ఆమె ఆశ్చర్యంతో ఏమిటన్నట్టుగా చూసారు.

"మీ ఇంట్లో ఇద్దరు దొంగలు చిక్కుకున్నారు—" అన్నారు శాలమ్మ.

డాక్టరమ్మ కంగారుతో కళ్ళు పెద్దవి చేసి "ఏమిటీ?" అన్నారు.

"భయంలేదు. వాళ్ళు తప్పించుకు పోకుండా తలుపు తాళం వేశాం మేము."

"ఓ భగవాన్; అయితే పోలిస్..."

డాక్టరమ్మ మాట కడ్డుతగిలి శాలమ్మ; "కాస్త ఆగండి — అందులో ఒకరు ఆడ, మరొకరు మగ—" అన్నారు.

"ఇంకేంగతి? స్పష్టంగా చెప్పండి. వాళ్ళెలా వచ్చారింట్లోకి? ఇంట్లో మావారు లేరా? స్కూలుకు వెళ్ళిపోయారా? తాళం సరిగ్గా వేయలేదా?"

"అన్నీ చెపుతా వినండి, ఇప్పుడో నెల రోజులుగా మీ ఇంట్లో ఏం జరుగు తోందో తెలుసా? మీరు జాగ్రత్తగా ఉండకపోతే మీకు ఆస్పత్రే గతి.''

"దయచేసి జరిగిందేంటో చెప్పండి," డాక్టరమ్మ బ్రతిమాలుకున్నారు.

"అయితే మీ కేం తెలియదన్న మాట?"

డాక్టరమ్మ తల అడ్డంగా ఊపారు.

"అవును పాపం మీ కేం తెలుస్తుంది? మీరు ఆస్పత్రికి వెళ్ళిపోయాక మీ ఆయన ఓ అమ్మాయిని ఇంటికి పిలి పించుకుంటాడు. వాళ్ళిద్దరూ పదకొండింటిదాకా సరదాగా కాలక్షేపం చేస్తారు. తరువాత కలిసి ఎక్కడికో వెడతారు.

డాక్టరమ్మ మొహం ఎర్రబడింది. కోపంతో పళ్ళు పటపట కొరికారు. ఆవేశంతో ఆమె మొహం కంపించింది.

"కాస్త ఓర్చుకోవాలి మీరు. వాళ్ళకు



బాగా బుద్ధిచెప్పాలనే బయట తాళం వేశాను—'' అన్నారు శాలమ్మ.

డాక్టరమ్మ తన ఆవేశాన్ని అతి కష్టంతో అణుచుకుని "పదండి'' అన్నారు.

శాలమ్మకూ స్వర్గానికీ మూడే అడుగుల అంతరం. ఆవిడ ఉత్సాహంతో ముందుకు నడిచారు.

తలుపుకు వేసిన తాళం తీసి తలుపు పూర్తిగా తెరిచి "అటు చూడండి'' అన్నారు శాలమ్మ.

మేష్టారు, ఆ అమ్మాయి చదరంగం అడుతూ కూర్చున్నారు.

తలుపు చప్పుడవగానే, మేష్టారూ, ఆ పిల్లా ఇటు తిరిగి చూశారు. ఆ అమ్మాయి డాక్టరమ్మను చూడగానే ఒక్క గంతులో ఆమె దగ్గిరకొచ్చి ఏడుపుగొంతుతో—

"అత్తయ్యా! వంట చేసి, మూత పెట్టి, పుస్తకాలు తీసుకుని, స్కూలుకు

వెడదామని వస్తే ఎంతకూ తలుపు తీయడానికి వీలుకాలేదు," అంది.

"డాక్టరమ్మ ఆ అమ్మాయి తల నిమురుతూ "ఏడవ కమ్మాయ్, ఏం చేస్తాం? ఈ ప్రపంచంలో కొంతమంది పిచ్చివా ళ్ళుంటారు. వాళ్ళు అనే మాట లను, చేసే పనులను పట్టించుకోకూడ దంతే," అన్నారు.

మేష్టారు నెమ్మదిగా వచ్చి తలుపు దగ్గర నుంచుని, శాలమ్మ, నరసమ్మల వేపు చూశారు.

డాక్టరమ్మ అదెలా తనను నిగ్ర హించుకున్నదో భగవంతుని కెరుక.

ఆవిడ శాలమ్మ వేపు తిరిగి ప్రశాం తంగా పలికారు.

"ఈయన మా వారు. ఈ అమ్మాయి ప్రేమ. మా వారి అక్క కూతురు. నేను ఉదయమే హస్పిటల్‌కి వెళ్ళాలి. ఆయనకు వంట చేతకాదు. అందుకే వారి అక్క కూతురు ప్రేమ వంట చేసి పెట్టి వెడుతుంది. ఈ ఏర్పాటు చేసింది ప్రేమ తల్లి. ఎందుకంటే ప్రేమకు పెళ్ళి సంబంధం నిశ్చయ మయింది – 'నేను ఎదుట ఉంటే ప్రేమ పని చెయ్యదు. రోజూ మీ ఇంటికి పంపుతాను. నీకూ సాయం చేసినట్టవుతుంది; తనూ పని నేర్చుకుంటుంది' అని పంపుతోంది. మీరు అనవసరంగా శ్రమ తీసుకున్నారు."

భూదేవి నోరు తెరవాలేదు. శాలమ్మ, నరసమ్మలను తనలో ఇముడ్చుకోనూ లేదు.

"ఏమిటి సరోజా ఈ గొడవ" మేష్టా రడిగారు.

"తరువాత చెపుతాను," అన్నా రావిడ.

ఆఖరికి శాలమ్మ నీళ్ళు నములుతూ "మరి అందరూ మిమ్మల్ని గురించి ఏదేదో అనుకుంటుంటే..."

డాక్టరమ్మ గొంతు తీక్షణంగా పలి కింది: "అందరూ మిమ్మల్ని గురించి ఏమనుకుంటున్నారో తెలుసా?"

ఏమి టన్నట్టు డాక్టరమ్మ వేపు చూశారు శాలమ్మ.

"ఈ ఆడవా ళ్ళిద్దరూ మగవా ళ్ళై అయ్యుంటే, మళ్ళీ మాట్లాడకుండా నాలు కలు కత్తిరించి పారేసేవాళ్ళం," అంటున్నారు.

శాలమ్మా, నరసమ్మా గబుక్కున వెనుదిరిగి గబగబా నడవసాగారు. డాక్టరమ్మ కేకేసి చెప్పారు.

"నేను చాలాబాగా శస్త్రచికిత్స చేయ గలను. కొంచంకూడా నొప్పుండదు."

ఇంటికొచ్చిన చాలా సేపటి వరకూ శాలమ్మ రొప్పుతూనే ఉన్నారు. మాట్లాడే శక్తి రాగానే పళ్లు కొరుకుతూ అన్నారు:

"కన్న వాళ్ళ గబ్బు కడిగే ఆడ దాని కెంత పొగరూ? ఆ పిల్లకూ – తన మొగుడికీ ఏమీ సంబంధం లేదని ఎలా చెపుతుంది? అక్క కూతురైతే నేం? ఆడపిల్ల కాదూ!"

కుక్క తోక...